క్లుప్తంగా

జీవాలను కాపాడుకుందాం



కేటీదొడ్డి: గొర్రెలు, మేకలకు తప్పకుండా వ్యాధి నిరోధక టీకా ఇప్పించాలని మండల పశువైద్య సహాయకుడు వెంకటేష్ అన్నారు. శనివారం మండలంలోని పాతపాలెంలోని గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను అందించారు. కార్యక్రమంలో గోపాల మిత్ర వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందుల పంపిణీ



అయిజ: గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు తప్పకుండా వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ స్వరూప రాణి కోరారు. శనివారం మండలంలోని ఉత్తనూరు, ఈడుగోనిపల్లి, భూంపురం గ్రామాల్లో సిబ్బంది మొత్తం 2,830 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాగించారు. సోమవారం మండలంలోని సంకాపురం, బింగుదొడ్డి గ్రామాల్లో మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు వేయనున్నట్లు ఆమె తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని నది అగ్రహారంలో ఉన్న 132కెవీ గద్వాల సబ్‌స్టేషన్‌లో 33 కేవీ మరమ్మతు నేపథ్యంలో ఆదివారం ఉదయం 6:30గంటల నుంచి 9:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని ఏడీఈ రమేష్‌బాబు తెలిపారు. 33 కేవీ లైన్లు మరమ్మతు కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఫీడర్ పరిధిలోని మల్దకల్, బిజ్వారంతో పాటు ఉపకేంద్రాలకు కూడా విద్యుత్ అంతరాయం ఉంటుందని, రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ



అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్ పరిధిలో గల గర్భిణులకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను శనివారం పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులకు అందిస్తున్న న్యూట్రిషన్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్ అన్నారు.

తెగుళ్లతో అప్రమత్తం



పెబ్బేరు: మండలంలోని బునాధిపూర్, రంగాపూర్, రాంపూర్ శివారులో వరి పంటలను శనివారం వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాసంగిలో సాగు చేసిన వరి పంటలకు వస్తున్న తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ నరేష్, రైతులు మద్దిలేటి, శేఖర్, కురుమన్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సైనిక్‌స్కూల్‌కు విద్యార్థిని..



క్షేత్ర

అమరచింత: మండలంలోని మస్తీపురం గ్రామానికి చెందిన క్షేత్ర సైనిక్ స్కూల్‌కు ఎంపికైందని లిటిల్ ఫ్లవర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకురాలు మీర్జా అన్వర్ బేగ్ తెలిపారు. జనవరిలో జరిగిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరో తరగతి సైనిక ప్రవేశ పరీక్షలో పాల్గొని300 మార్కులకు గాను 253 మార్కులు సాధించిందన్నారు. ఆల్‌ఇండియా స్థాయిలో 2,446 ర్యాంకుసాధించి సీటు దక్కించుకున్న క్షేత్రకు పలువురు అభినందనలు తెలిపారు.

కంటివెలుగు శిబిరం

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమంతో అంధత్వ సమస్యలు తీరనున్నాయని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ రమేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ అన్నారు. శనివారం మున్సిపాలిటీలోని 6 వార్డులో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని కౌన్సిలర్ యాదమ్మతో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో వైద్యులు నిస్సార్ అహ్మద్, రంజిత్‌రెడ్డి, శివలీల, దీపిక, నిఖిత, హెల్త్‌సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

ఎర్రవల్లి చౌరస్తా: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. శనివారం ఇటిక్యాల మండలంలోని వల్లూరులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. రైతు పండించిన ప్రతి గింజను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను రైతులు సద్వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రంగారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, గిడ్డారెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



వల్లూరులో మాట్లాడుతున్న అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

శాంతినగర్ : వడ్డేపల్లి పీఏసీఎస్ కార్యాలయం, పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం శనివారం సందర్శించారు. అనంతరం పీఏసీఎస్ కార్యాలయంలో అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మీరెడ్డి, డైరెక్టర్లు, సిబ్బందితో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పప్పుశనగలను ప్రభుత్వం రూ.5,335కు కొనుగోలు చేస్తుందని, నియోజక వర్గంలోని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట వడ్డేపల్లి జెడ్పీటీసీ కాశపోగు రాజు, ఎంపీపీ రజిత, మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణ, రైతుసమన్వయ సమితి మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వున్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

శాంతినగర్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన పప్పుశనగ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి లాభం పొందాలని వడ్డేపల్లి పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ ప్రాథమిక సహకారం సంఘం కార్యాలయ భవన ఆవరణలో శనివారం పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ ప్రారంభించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో క్వింటాల్‌కు రూ.5,335 ధర ఉందన్నారు. బహిరంగ మార్కెట్‌లో ధర తక్కువగా ఉందని, రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం, మార్క్‌ఫెడ్ కల్పించిన అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ కోరారు. ఆయా గ్రామాలకు చెందిన ఏఈఓల వద్ద టోకెన్లు తీసుకుని సోమవారం నుంచి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మీరెడ్డి, సీఈఓ రవి, సీనియర్ అసిస్టెంట్ రాము, వడ్డేపల్లి ఏఓ రాధ, రాజోళి ఏఓ చంద్రశేఖర్, రైతు సమన్వయసమితి అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయుల బృందం

మానవపాడు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బహుమతులను ప్రదానం చేశారు. పాఠశాలలో ఆర్‌జేడీగా శివకుమార్, కలెక్టర్‌గా మహ్మద్‌గపూర్, డీఈఓగా శ్రియ, జెడ్పీ చైర్‌పర్సన్‌గా రిజ్వాన, ఎంఈఓగా సాధిక్, తహసీల్దార్‌గా మణికుమారి బాధ్యతలను నిర్వహించారు. మొత్తం 58 మంది విద్యార్థులు ఉపాధ్యాయులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులుగా తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చిన్నయ్య, ఉపాధ్యాయులు లక్ష్మన్న, శ్రీనివాస్‌రెడ్డి, డీటీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ శేఖర్

మల్దకల్: ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శేఖర్ సూచించారు. శనివారం మండలంలోని బిజ్వారం ఉన్నత పాఠశాలలో ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మొబైల్ ఫోన్లలో బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ నంబర్లు చెప్పవద్దన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మన్న, హెడ్మాస్టర్ విజయప్రభ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై నిర్లక్ష్యం వీడాలి



చెన్నిపాడు అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలిస్తున్న ముషాహీదాబేగం

మానవపాడు: ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావడంతో పాటు క్రమశిక్షణగా ఉంటే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని, చదువుపై నిర్లక్ష్యం వీడాలని జెడ్పీసీఈఓ ముసాహీదాబేగం సూచించారు. శనివారం మండలంలోని చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు, చెన్నిపాడు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదువుకోవాలన్నారు. గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించి వారికి పౌష్టికాహారం అందించేలా అంగన్‌వాడీ టీచర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నర్సరీలో ప్రతి మొక్కను సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

మొక్కలకు నీళ్లు పట్టాలి

అలంపూర్: మొక్కలకు క్రమం తప్పకుండా నీళ్లు పట్టాలని జెడ్పీసీఈఓ ముషాహీదాబేగం అన్నారు. ఉండవెల్లి మండలంలోని పుల్లూరు శివారులో ఉన్న జాతీయ రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలను ఆమె నీరు పట్టారు.

మెరుగైన విద్య అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు మణికంఠం

మల్దకల్: మండలంలోని పెద్దపల్లి, అమరవాయి, మల్దకల్ పాఠశాలలను శనివారం విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకుడు మణికంఠం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ కొండారెడ్డి, హెడ్మాస్టర్లు జానకమ్మ, ఇమ్మానియేలు పాల్గొన్నారు.

28న కళాశాల విద్యార్థులకు ప్రతిభా పోటీలు



పోస్టర్లను విడుదల చేస్తున్న అధ్యాపకులు

కొల్లాపూర్: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఈనెల 28న ఇంటర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతిభా పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మల్లేశం తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. మానవ జీవితంలో సైన్స్‌పాత్ర అంశంపై వ్యాసరచన పోటీలు, భారత రక్షణ వ్యవస్థ అంశంపై వక్తృత్వ, క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. ప్రతి కళాశాల నుంచి ఐదుగురు పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు జెడ్పీహెచ్ పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ పదో తరగతి విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించారు. ప్రతి విద్యార్థి పదో తరగతిలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తొలిమెట్టు కార్యక్రమంపై ఆరా తీశారు .

కుటుంబ పాలనను సాగనంపుదాం

ఆత్మకూర్: బీఆర్ఎస్ కుటుంబ పాలన సాగనంపేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి, శక్తికేంద్రం ఇన్‌చార్జీ సహదేవ్, నియోజకవర్గ కోకన్వీనర్ రేచింతల శ్రీను అన్నారు. శనివారం రాత్రి మండలంలోని తిప్పుడంపల్లిలో ప్రజాఘోష బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబ పాలన అవినీతిమయమని, పచ్చి అబద్దాలతో ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. మోదీతోనే దేశ అభివృద్ధి సాధ్యమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో అశ్విన్‌కుమార్, రాజు, బాలరాజు, రాఘవేంద్ర, నాగేందర్, రాము, ఆనంద్, సూరి, అశోక్, ఎల్లన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జలంధర్‌రెడ్డి

ఎస్‌ఐని సస్పెండ్ చేయాలని వినతి

కోడేరు: మండల ఎస్‌ఐ నరేందర్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని శనివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహ మాట్లాడుతూ ఈనెల 23న పోలీస్‌స్టేషన్‌లో రైతుల విషయం మాట్లాడేందుకు వెళ్తే.. అగౌరవపర్చి దూషించాడని అన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ పట్టాభికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాలిక్, బుచ్చన్న, రవి, శివుడు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పాతసామాన్ల దుకాణం తరలించాలని ఆదేశం



జమేదార్ కాలనీలో పాత ఇనుపసామన్ నిర్వహకులకు నోటీస్ అందిస్తున్న కమిషనర్ రమేష్

ఆత్మకూర్: జమేదార్ వీధిలో నివాసాల మధ్య పాత ఇనుప సామన్లు, అట్టలు, డబ్బాలు, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను సేకరణ చేసి డంపు చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు కమిషర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన వెంటనే సిబ్బందితో అక్కడికి వెళ్లి పాత సామాన్ నిర్వాహకులకు నోటీసులు ఇవ్వడంతో పాటు, రూ.వెయ్యి జరిమాన విధించారు. వారం రోజుల్లోగా ఊరికి దూరంగా దుకాణం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జమేదార్ కాలనీలో విద్యుత్ స్తంభాలకు అల్లుకుపోయిన తీగ చెట్లను తొలగించి వీధి దీపాలను అమర్చారు. వనపర్తి డిపో మెనేజర్ మహేశ్వరితో ఫోన్‌లో మాట్లాడి ఉదయం 6:15 గంటలకే ఆత్మకూర్ నుంచి బస్సును నడిపించాలని కోరారు. ఆత్మకూర్ నుంచి కొత్తకోట మీదుగా హైదరాబాద్‌కు బస్సును నడిపించాలని కోరగా డీఎం సానుకూలంగా స్పందించి త్వరలోనే బస్సులను నడుపుతామని హామీనిచ్చారు.

డీఈ కార్యాలయం ఎదుట ధర్నా



డీఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న జేఏసీ నాయకులు

గద్వాల అర్బన్: గతేడాది ఏప్రిల్ నుంచి విద్యుత్ ఉద్యోగాలకు పీఆర్సీని అమలు చేయలేదని నిరసిస్తూ విద్యుత్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో డీఈ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ కో చైర్మన్ అశోక్, నాయకులు భాస్కర్, ప్రసాద్, సుదర్శన్, వెంకటేష్, ఆరీఫ్, గాయత్రి, పద్మమ్మ, లక్ష్మి, రాధిక, రిహానబేగం, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి



ఎర్రమట్టి వీధిలో పర్యటిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గద్వాల అర్బన్: కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని పార్టీ జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎర్రమట్టి వీధిలో 13వ రోజు హాథ్ సే హాత్ జోడో యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు నిత్యావసర ధరలను పెంచారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500లకు గ్యాస్, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, ఆరోగ్యశ్రీ మరింత బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నారాయణ రెడ్డి, గౌస్, ఇసాక్, షేక్ జమాల్, నందు, రాజేంద్ర పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



అయిజలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అధికారుల, ప్రజా ప్రతినిధులు

అయిజ: మున్సిపాలిటీలోని 10వ వార్డులో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులను శనివారం మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, వైస్ చైర్మన్ మాల నరసింహులు, మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణం పనులు నిబంధనల మేరకు సకాలంలో పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో మహబూబ్ బాషా పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని చంద్రశేఖర్‌నగర్‌లో ఉపాధిహామీ పథకం కింద నిర్మిస్తున్న సీసీ రోడ్లు నిర్మాణం పనులను శనివారం ఎంపీడీఓ రమణ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందు వల్ల నర్సరీలో షెడ్‌నెట్ ఏర్పాటు చేయాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. నర్సరీలోని విత్తనాలు మొలకెత్తని ప్యాకెట్ల స్థానంలో కొత్త విత్తనాలను నాటాలన్నారు. కార్యక్రమంలో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు సురక్షితం



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి రామకృష్ణ

అలంపూర్ రూరల్: ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రతి గర్భిణికి కాన్పులు చేపట్టేలా ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారిణి ప్రసూన సూచించారు. మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీలో శనివారం వైద్య సిబ్బందితో నెలవారి సమీక్ష సమవేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా మలేరియా అధికారి రామకృష్ణ మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించాలన్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు..

గ్రామాలు, పీహెచ్‌సీల్లో అందిస్తున్న వైద్య సేవలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలని ఆదేశించారు. కంటివెలుగు శిబిరాల్లో ఆర్డర్‌పై వచ్చిన అద్దాలను ఎప్పటికప్పుడు ప్రజలకు పంపిణీ చేయాలన్నారు. జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపాలని సూచించారు. కుష్టు వ్యాధి నియంత్రణలో భాగంగా అనుమానితులను గుర్తించి వారు మందులు సక్రమంగా వాడాలే అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్, పీహెచ్ఎన్ లీలమ్మ, హెచ్ఎస్ అక్కమ్మ, హెచ్ఏ బాలీశ్వరయ్య శెట్టి, ఏఎన్ఎంలు శ్యామల, సురేఖ, విజయలలిత, సువర్ణ, విజయ తదితరులు పాల్గొన్నారు.

టైరు పేలి వాహనం బోల్తా



జాతీయ రహదారిపై బోల్తా పడిన వాహనం

ఉండవెల్లి: మండలంలోని ఇటిక్యాలపాడు శివారులోని ఘర్ దాబా సమీపంలో ఓ వాహనం టైరు పేలడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. శనివారం కర్నూల్ నుంచి హైదరబాద్‌కు జాతీయ రహదారిపై పైప్‌ల లోడ్‌తో ప్రయాణిస్తున్న అశోక్ లైలాండ్ టైరు పేలడంతో ఒక్కసారిగా డ్రైవర్ రాకేష్ వాహనాన్ని కంట్రోల్ చేయలేక డివైడర్‌ను ఢీ కొని బోల్తా పడింది. దీంతో పైపులు కిందపడడంతో జాతీయ రహదారిపై వాహనాలు కొద్ది సేపు నిలిచిపోయినట్లు తెలిపారు. డ్రైవర్ రాకేష్‌కు స్వల్ప గాయాలవడంతో నేషనల్ హైవే సిబ్బంది అంబులెన్స్‌లో చికిత్స చేసి, వాహనాన్ని క్రేన్ సహాయంతో తొలగించినట్లు పోలీసులు తెలపారు.

అలరించిన భక్తి గీతాలు, భజనలు



భజన బృందాలను సన్మానిస్తున్న నిర్వాహకులు

రాజోళి: భ్రమరాంబ అడివేశ్వరస్వామి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన భజన పాటలు భక్తులను అలరించాయి. రాజోళిలోని అడివేశ్వరస్వామి దేవస్థానం వద్ద జరిగిన ఈ పోటీలో ఎనిమిది జట్లు పాల్గొనగా.. అందరికీ భోజనాలు, చార్జీలకు సరపడా నగదును ఆలయ కమిటీ అందించి శాలువా, మెమెంటోలతో సన్మానించారు. జాతర సందర్భంగా శనివారం పొట్టేళ్ల పందెం నిర్వహించగా ఆయా ప్రాంతాల నుంచి ఆరు పొట్టేళ్లు తలపడగా మూడింటిని విజేతలుగా ప్రకటించి బహుమతులను అందజేశారు.

పరామర్శ

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన ఆటో భగవంతు అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం విషయం తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్ కార్యకర్తలతో కలిసి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి వెంట సింగిల్ విండో డైరెక్టర్ శ్రీనివాస్‌గౌడ్, మండల మీడియా కన్వీనర్ రమేష్ ఉన్నారు.